

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం



ఆదివారం 22-03-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 303 రూ॥ 6.00







చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888








# ఆస్తులు... అనుబంధాలు!

## బంధాలన్నీ నకిలి... ఆస్తులే కలిమి!

- ప్రేమలన్నీ పై పైనే.. లోపలంతా విషమే.
- అడిగినవన్నీ ఇస్తే సంతోషమే.. అంతా గందరగోళమే.
- పరువు లేదు.. పరపతి కాదు.. డబ్బుకు లోకం దాసోహమే.
- అనుబంధాలన్నీ ఆస్తుల కోసమే!
- ఆస్తుల దాకా వస్తే అందరూ అంతే!
- డబ్బు ఎంత వారినైనా విడదీస్తుంది.
- వైస్ విజయమ్మ ఉత్తరం తో మరోసారి బైట పడింది.
- సాక్షి పత్రికలో వచ్చిన వార్త అబద్దమని సూటిగానే చెప్పింది.
- సాక్షి లో వచ్చిన వార్త సాక్షిగా ధనమే మూలం.
- జగతి అంతా డబ్బు చుట్టే ప్రదక్షిణం.
- ఎవ్వరూ అతీతులు కాదు.. డబ్బుంటే ఎవరికీ చేదు కాదు.
- తల్లి తండ్రి కూడా మినహాయింపు కాదు.
- రాజకీయ నాయకులంతా ఆస్తుల బందీలే!
- తాజాగా వై ఎస్ విజయమ్మ ఉత్తరం అందులో భాగమే!
- చెల్లికి అన్యాయం అన్న చేయలేదు అని వైసీపీ నాయకుల వాదన.
- చెల్లికి అన్న అన్యాయం చేశాడని స్వయంగా తల్లి ఆవేదన.

## రాజకీయ కుటుంబాలు.. పంపకాలలో విభేదాలు!

- ఇవి కూడా రాష్ట్ర సమస్యలే.. ప్రజా సమస్యల కన్నా పెద్దవే.
- ప్రజల్లో చర్చించుకునే అంశాలే! • రాజకీయ రగడలో బాగాలే!
- రాజకీయ కుటుంబాలలో కొత్తేమి కాదులే.
- ఇందిరా గాంధీ కుటుంబం నుంచి ఉన్నదే.
- ఎన్టీఆర్ కుటుంబం లో జరిగిందే.
- కేసీఆర్ కుటుంబం లో కలతలకు కారణమదే.
- వైస్ కుటుంబం లో కొంత కాలంగా నలుగుతున్నదే.
- రాజకీయాల సంపాదన లోగుట్టులన్ని జనానికి తెలిసినవే.
- కూతురు రాజకీయం కోసం తల్లి విజయమ్మ ఆరాటం.
- కొడుకు రాజకీయం ఏమైనా పర్వాలేదన్న ధైర్యం.
- పిల్లల విషయంలో తల్లి దండ్రుల ఆలోచనలకు ఇదే నిదర్శనం.
- తల్లిదండ్రులలో కూడా పిల్లల ప్రేమలో స్వార్ధాలు ఉంటాయనేది నిజం.
- కడుపులో పుట్టిన పిల్లలే అయినా అమ్మ ప్రేమ లో వ్యత్యాసాలకు సాక్ష్యం.

హైదరాబాద్, నేటిధాత్రి:

ఏ బంధమైనా సరే ధనంతోనే ముడిపడి వుంటుంది. ఏ చరిత్ర చూసినా ఇదే కనిపిస్తుంది. అది రాజ్యమైనా, రాజరికమైనా,రాజకీయమైనా, ఆఖరుకు పేదరికమైనా సరే బంధాలన్నీ డబ్బుతోనే ముడిపడి వుంటాయి. ధనం మూలమిదం జగత్ అని పెద్దలు ఊరికే అనలేదు. అందుకే లెక్కల్లో తేడాలొస్తే అంతే..అది ఎంతటి వారికైనా పంచాయితీకి ఆజ్యమే. రామాయణం చూసినా కనిపించేది ఇదే. బారతం మొత్తం కనిపించేది ధనమే. ఐదు ఊర్లు ఇచ్చేందుకు కూడా కౌరవులు ఒప్పుకోకపోవడమే మహాభారతం. పెద్ద కొడుకును కాదని చిన్న కొడుకుకు పట్టం కట్టడమే రామాయణం. మనమెంత మావన మాత్రులమని అనుకుంటూనే పోరు లేనిదే ఈ కుటుంబం కలిసి లేదు. అది తరాలు మారినా బందానికి ఎన్ని బాంధవ్యాలు తోడైనా సరే దనంతోనే ఆత్మీయం. ధనంతోనే శత్రుత్వం. ధనమే అన్ని వినాశకాలకు మూలం. అనుబంధాలన్నీ ట్రాష్. అందుకే ఎంత పెద్ద కుటుంబమైనా ఎప్పుడో అప్పుడు రోడ్డున పడాల్సిందే. పది మంది ముందు పంచాయితీ పెట్టాల్సిందే. తాజాగా దివంగత వైఎస్ కుటుంబానికి చెందిన ఆస్తుల పంపకాలు, అన్నా చెల్లళ్ల మధ్య ముదిరిన పోరుకు సంబంధించిన ఓ వార్త వచ్చింది. ఏపి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన చెల్లి షర్మిలకు ఇవ్వాల్సింది ఇచ్చారని ఆ వార్త సారాంశం. ఎంతో ఉదారంగా తన చెల్లెలు కోసం అన్న జగన్ ఇవ్వాల్సిందానికన్నా ఎక్కువే ఇచ్చారనేది వైసిపి నుంచి వినిపిస్తున్న బలమైన వాదన. దానికి జగన్ తల్లి విజయమ్మ అదే రోజు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైసిపి పార్టీ చేస్తున్న ప్రచారం అబద్ధమని తేల్చేసింది. షర్మిలకు రావాల్సిన పంపకాలు పూర్తి కాలేదన్నది ఆమె లేఖలోని సారాంశం. ముఖ్యంగా సరస్వతీ సిమెంట్‌తోపాటు ఇతర ఆస్థులలో వాటాలు అందలేదని, సాక్షిలో వచ్చిన కథనం నిజం కాదని విజయమ్మ తేల్చి చెప్పింది. వైఎస్. రాజశేఖరరెడ్డి బతికివున్నప్పుడు వున్న ఆస్థి ఇద్దరు పిల్లలకు సమానమని, వారి వారసులకు సమానంగా పంచాలని కోరుకున్నాడని విజయమ్మ చెబుతోంది. ఆ విషయాలు తనకు, పైనున్న దేవుడు, జగన్‌కు తెలుసంటూ ఆ లేఖను ముగించారు. అంటే ఇంత కాలం పదవుల



పంచాయితీ అని అందరూ అనుకున్నారు. జగన్ తన సొంత చెల్లికి అన్యాయం చేశాడని రాజకీయంగా ఇతర పార్టీలు వాడుకున్నాయి. జగన్ జైలులో వున్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసిందని, పార్టీకోసం ఎంతో కష్టపడిందని అనేక వార్తలున్నాయి. నిజమే కావొచ్చు. కాని జగన్ జైలు నుంచి విడుదల కాకపోతే పార్టీ బాద్యతలు తన చూసుకోవాల్సి వస్తుందన్న ఆలోచనతో కూడా షర్మిల పార్టీకోసం పనిచేసిందనే వార్తలు కూడా వున్నాయి. జగన్ మొదలు పెట్టిన ఓదార్పు యాత్రను కూడా ఆమె చేపట్టడంతో అన్నమీద ప్రేమతో కాదనే వార్తలు కూడా వున్నాయి. పైగా షర్మిల తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేసుకునే సమయంలో ఏకంగా 250 కోట్ల రూపాయలు కూడా ఇచ్చినట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. జగన్ తన చెల్లికి ఎలాంటి అన్యాయం చేయలేదన్నది వైసిపి బలంగా చెబుతున్న మాట. ఈ మాట జగన్ నోటి నుంచి కాకుండా పార్టీ శ్రేణుల నుంచి రావడం వల్ల తల్లి విజయమ్మ మీడియాకు లేఖ విడుదల చేసిందనేది కూడా ప్రచారంలో వుంది. ఏది ఏమైనా ఏ కుటుంబమైనా సరే ముందు పదవుల పంపకాల విషయంలో రాద్దాంతాలు మొదలై, ఆఖరు ఆస్తుల పంపకాలు తెరమీదకు వస్తాయన్నది మరోసారి రుజువైంది. అన్న బాగుంటే చాలు. అమ్మ బాగుంటే చాలు. కొడుకు బాగుంటే చాలు అనేకునే రోజులు ఎప్పుడూ లేవు. ఇప్పుడు కూడా వైఎస్ కుటుంబంలో ఇదే కనిపిస్తోంది. కాని అక్కడకద్క కొన్ని కుటుంబాలు వున్నాయి. అన్న కోసం చెల్లెలు త్యాగం కనిపిస్తుంది. చెల్లెలు కోసం అన్న త్యాగం కూడా కనిపిస్తుంది. వాటిని ఆదర్శంగా తీసుకుంటారని అనుకుంటాం. కాని అలాంటి మంచి విషయాలు ఎవరూ ఆదర్శంగా తీసుకోరు. తమిళనాడులో కరుణానిధి కుటుంబంలో కూడా గతంలో ఇలాంటి పంచాయితీలే మొదలయ్యాయి. కనిమొలి ఇలాంటి రాజకీయాలకు భిన్నంగా ఆదర్శంగా నిలిచింది. నిజానికి కనిమొలి రాద్దాంతం చేస్తే



అక్కడ రాజకీయం మరోలా వుండేది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కనిమొలి చెల్లెలే ..కాని సొంత చెల్లెలు కాదు. కరుణానిధికి ఇద్దరు భార్యలు. ఇలా సవతి తల్లులు సంతానమే కరుణానిధి కుటుంబం. అయినా తన తండ్రి పేరు శాశ్వతంగా నిలిచిపోవాలంటే అన్నతో విభేదాలకన్నా, సఖ్యతే ముఖ్యమని కనిమొలి అనుకున్నారు. అన్నకు తోడుగా నిలిచారు. పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు. స్టాలిన్ తర్వాత ఆయన కొడుకు ఉదయ్ నిధి వారసుడుగా కనిపిస్తున్నా, కనిమొలి సహకరిస్తూనే వుంది. అందుకే అక్కడ రాజకీయ గొడవలు లేవు. ఆస్థుల పంపకాలపై పేచీలు లేవు. కాని తెలుగు రాష్ట్రాలలో రెండు పార్టీలలోనూ ఇదే కనిపిస్తోంది. ప్రజలకు కూడా ఇలాంటి వార్తలే ఆసక్తిగా వుంటాయి. తెలంగాణ ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో షర్మిలను ఆదరించరని తెలిసినా ఆమె మొండితనంతో పార్టీ పెట్టింది.




పుట్టిల్లు ఆంద్రా అయితే మెట్టినిల్లు తెలంగాణ. ఆడపిల్లకు అత్తవారిల్లే అసలైన ఇల్లు అని షర్మిల చెప్పింది. తెలంగాణలో పార్టీ పెట్టింది. ఏమైంది. ప్రజలు తిరస్కరించారు. ఎంతో మంది హితవు పలికారు. కాని షర్మిల వినలేదు. తెలంగాణలో తాను ప్రత్యామ్నాయం అనుకున్నారు. కాని జనం తిరస్కరించారు. దాంతో మళ్లీ షర్మిల ఏపికి వెళ్లారు. మళ్లీ సొంత అన్నకే బల్లెమయ్యారు. అన్న రాజకీయాన్ని అడ్డుకున్నారు. అన్నను ఓడించడమే ధ్యేయంగా రాజకీయాలు చేశారు. అన్నను ఓడించారు. ఇంత చేసి ఇప్పుడు ఆస్థుల పంపకాలు అంటే ఏ అన్న అయినా ఒప్పుకుంటారా? షర్మిల చేసిందాంట్లో న్యాయముందని ఎవరైనా అనుకోవడం లేదు. కాని ఆమె మాత్రం తాను చేస్తున్నదే కరక్టు అని అనుకోవడంలో కూడా తప్పులేదు. దాదాపు అదే పరిస్థితి కేసిఆర్ ఇంట్లో కూడా చూడొచ్చు. ఇక్కడ అది రాజకీయ పంచాయితీలాగానే కనిపించేలా వ్యహరిస్తున్నారు. ఎక్కడో తేడా కొడుతుందన్న సంగతి అందరూ అనుకున్నదే. లేకుంటే పదవుల పంచాయితీ అనేది ప్రభుత్వంలోవున్నప్పుడు జరగాలి. పార్టీ అదికారంలో వున్నప్పుడు తన ప్రాదాన్యతల గురించి ప్రశ్నించాలి. తనకు జరిగిన అన్యాయం గురించి చర్చించే అవకాశం వుంది. తనను ఓడించిన వారిని పార్టీ నుంచి పంపించేంత శక్తి కూడా అప్పుడు కవితకు వుంది. తన ఓటమికి కారణమైన వారిని ఇబ్బందులకు గురిచేసే శక్తి కూడా వుంది. అంతెందుకు పెద్ద పెద్ద నాయకులు కూడా ఆ సమయంలో నోరు తెరిచేందుకు కూడా భయపడేవారు. తమ అభిప్రాయాలను కూడా ధైర్యంగా చెప్పుకునే స్వేచ్ఛ లేదు. మంత్రులు కూడా నేరుగా ప్రగతి భవన్‌లోకి వేళ్లే పరిస్థితి కనిపించలేదు. అప్పాయింటు మెంటు వుంటే తప్ప ఎంత పెద్ద నాయకుడైనా సరే వెళ్లేందుకు వీలు లేదు. కాని కవితకు అలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే ఆమె కుటుంబ సభ్యురాలు. పైగా స్వయంగా కేసిఆర్ కన్న కూతురు. బంధువులకే లేని కష్టాలు కవితకు వున్నాయంటే ఎవరైనా నమ్ముతారా? అందుకే కవిత విషయంలో కూడా నిఘూడంగా దాగిన వున్న నిజమదే అని అంటున్నారు. ఎప్పుడో అది బైట పడకుండా వుండేది కాదని అంటున్నారు. ఇలా రాజకీయ పార్టీ విషయంలో ఆస్థుల పంచాయితీ ఈనాటిది కాదు. ఇందిరాగాంధీ కాలం నుంచే మన రాజకీయాల్లో కనిపిస్తుంది. ఇందిరాగాంధీ ప్రధానిగా వున్న సమయంలో రాజీవ్‌గాంధీ క్రియాశీల రాజకీయాల్లో లేరు. ఆయన రాజకీయాలకే దూరంగా వున్నారు. ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ ఆ రోజుల్లోనే డిఫాక్టో పిఎంగా పనిచేసినంత పనిచేశారు. ప్రతి విషయంలోనూ నిర్ణయం సంజయ్‌గాంధీ తీసుకున్నట్లు కూడా ఇప్పటికీ ఆ తరం నాయకులు చెబుతుంటారు. పైగా ఆ రోజుల్లో రచయితలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాసిన పుస్తకాలలోనూ వివరించారు. ఎప్పుడైతే సంజయ్ గాంధీ మరణించారో అప్పుడు రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. తల్లి ఇందిరాగాంధీ మరణంతో పూర్తి స్తాయి నాయకుడు కావాల్సి వచ్చింది. అప్పటి నుంచి రాజీవ్ గాందీ, సంజయ్‌గాంధీ కుటుంబాల మధ్య దూరం పెరిగింది. ఆస్థుల గొడవలు, పదవులు గొడవలు, అదికారం వంటి వాటిపై అంతర్గతంగా పెద్దఎత్తున చర్చలు జరిగాయి. ఆస్థిపాస్తుల ముందు అన్నీ బలాదూరే అని ఇందుకే అంటారేమో!!



నిష్పక్షపాత వార్తల నిలయం

నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 22-03-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 303 రూ|| 6.00


# భారత్‌కు ఎల్ఎన్‌జీ కష్టాలు!




- ఖతార్‌లోని రాస్ లాఫన్ నగరంపై ఇరాన్ దాడులు
- ధ్వంసమైన ఎల్ఎన్‌జీ సంస్థ మౌలిక సదుపాయాలు
- మరమ్మత్తులకు మూడు నాలుగేళ్లు పట్టే అవకాశం
- ప్రత్యామ్నాయాలకోసం భారత్ యత్నాలు
- చమురుకు ఇబ్బందులు లేవు
- యుద్ధం ప్రభావం పడకుండా చర్యలు



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

**హైదరాబాద్, నేటిధాత్రి:**
రాస్ లాఫన్ పారిశ్రామిక నగరంపై ఈనెల 18న ఇరాన్ జరిపిన క్షిపణీ దాడులతో ఇక్కడినుంచిఎల్ఎన్‌జీ సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. ముఖ్యంగా ధ్వంసమైన ఎల్ఎన్‌జీ మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు దాదాపు 3-4 సంవత్సరాల కాలం పట్టనుండటంతో భారత్ లో తీవ్ర గ్యాస్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. దేశీయ అవసరాల్లో 40-47% వరకు గ్యాస్ అవసరాలు ఈ క్షేత్రం నుండి సరఫరాయ అయ్యే గ్యాస్‌తోటే తీరుతున్నాయి. ఇరాన్ క్షిపణిదాడి నేపథ్యంలో "ఫోర్స్ మజూర్" నిబంధన యాక్టివేట్ కావడంతో మనదేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఇక్కడ "ఫోర్స్ మజూర్" అంటే "యాక్ట్ ఆఫ్ గాడ్" లేదా కంపెనీకి సంబంధంలేని అనుకోని విపత్తు సంభవించినప్పుదు, గ్యాస్ సరఫరాను నిలిపేయవచ్చు. ఇప్పుడు ఇరాన్ క్షిపణి దాడిలో ఇది ధ్వంసం కావడంతో గ్యాస్ సరఫరాలు నిలిచిపోతే మనదేశం ఏమీ చేయలేని పరిస్థితి. ప్రస్తుతం ఇరాన్ దాడుల వల్ల ఖతార్ గ్యాస్ ఎగుమతి సామర్థ్యం 17% తగ్గుతుంది. ఈ దాడిలో రెండు "ఎల్ఎన్‌జీ"ట్రైన్‌లు దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఖతార్‌కు చెందిన "ఖతార్ ఎనర్జీ" మనదేశానికి చెందిన "పెట్రోనెట్ ఎల్ఎన్‌జీలు" ఫోర్స్ మజూర్‌ను ప్రకటించే అవకాశాలుండటంతో, చట్టబద్ధంగా మన దేశానికి చెందిన గెయిల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థలకు గ్యాస్ సరఫరాలు తాత్కాలికంగా నిలిచి పోనున్నాయి. పోనీ ధ్వంసం కాని ఇతర "ట్రైన్"లనుంచి గ్యాస్ తెచ్చుకుందా మనకున్నా, హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో అక్కడికి గ్యాస్ ట్యాంకర్లతో కూడిన ఓడలు వెళ్లడానికి వీల్లేదు. మనదేశీయ అవసరాల్లో 60% గ్యాస్ ఈ జలసంధినుంచే సరఫరా అవుతుంది.ప్రస్తుతం "దిశ", "రాణి" వంటి గ్యాస్ ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధిని దాటి ఖతార్‌లోని లోడింగ్ పోర్టులను చేరే పరిస్థితి లేదు.

ఇక దేశీయంగా ఇప్పటికే పారిశ్రామిక వినియోగదార్లకు గ్యాస్ మార్కెటర్లు 10% నుంచి 40% వరకు గ్యాస్ సరఫరాలో కోత విధించారు. ప్రస్తుతం గృహావసరాలకు, రవాణాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెరిగిన గ్యాస్ ధరలతో దేశంలో యూరియా ఉత్పత్తి ఖర్చు పెరగనున్నది. దీంతో రైతులకు సరఫరా అయ్యే యూరియా ఖర్చు కూడా పెరుగుతుంది. దీనివల్ల రిటైల్ ఖర్చులు పెరగకుండా చూసేందుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ధరలు కూడా పెరుగుతాయి. ఇది దేశ ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపగలదు.

ప్రపంచంలోనే అతిపెద్ద పెట్రోల్ జీటీఎల్ (గ్యాస్ టు లూబ్రికెంట్స్) ఫెసిలిటీ దెబ్బతినడంతో బేస్ ఆయిల్స్ ఉత్పత్తిలో 50% కోత విధించడం తథ్యం. దీని ప్రత్యక్ష ప్రభావం బీఎస్-6 వాహనాల పై పడనుంది. క్యాస్ట్రోల్ ఇండియా, గల్ఫ్ ఆయిల్ వంటి సంస్థలపై ఈ ప్రభావం పడటమే ఇందుకు కారణం.



ప్రస్తుతం ఆసియన్ ఎల్ఎన్‌జీ స్పాట్ ధరలు రెట్టింపు అయ్యాయి. ఫలితంగా ఎంఎంబీటీయూకు 15 డాలర్లకు చేరుకుంది. ఇప్పుడు యు.ఎస్, ఆస్ట్రేలియాల్లో అందుబాటులో వున్న పరిమిత ప్ర త్యామ్నాయ కార్గోలకోసం మనదేశం యూరప్, తూర్పు ఆసియా దేశాలతో పోటీపడాల్సిన పరిసితి ఏర్పడింది. ప్రస్తుత మార్కెట్ అస్థిరతల నేపథ్యంలో పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, గెయిల్ సంస్థల షే ర్లు 7-8% పడిపోయాయి. సరఫరాల రిస్కులు అధికంగా వుండటం వల్ల మదుపర్లలో అయోమ యం ఏర్పడటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతానికి పెట్రోల్/డీజిల్ ధరలు స్థిరంగా వున్న ప్పటికీ దిగుమతి బిల్లులు తడిసి మోపెడవుతుండటంతో ప్రత్యామ్నాయ ఇంధన ధరలు కూడా పెరిగే అవకాశముంది. ఫలితంగా పారిశ్రామిక ద్రవ్యోల్బణం ఏర్పడు ప్రమాదముంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయాల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, ధ్వంసమైన ఇంధనవనరులకు తక్షణం పరిష్కారమిచ్చేవిగా

లేవు. ఏదైనా కొంత సమయం పడుతుంది. ఇది సంవత్సరాలు కూడా కావచ్చు. ఏదైనా అనుకోని విధ్వంసం వల్ల కలిగే నష్టాన్ని పూడ్చటం ఏ దేశ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు. గ్రేటర్ ఇజ్రాయిల్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో అమెరికా తీసుకొచ్చిన ఈ యుద్ధం ఇప్పటిదో ఆగే పరిస్థితి లేదు. ఇరాన్ వరుసగా దాడులు చేస్తున్న నేపథ్యంలో, ఇప్పటి వరకు మౌనంగా పాటిస్తున్న గల్ఫ్ దేశాలు ఒకానొక దశలో సహనం కోల్పోయి ఇరాన్‌పై ఎదురుదాడికి దిగితే మధ్యప్రాచ్యం మొత్తం అల్లకల్లోలమై, ప్రపంచం మొత్తం కోలుకోలేని సంక్షోభంలోకి కూరుకుపోవడం ఖాయం.



ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ గెలిచే అవకాశాలు ఎంతమాత్రం లేవు. కానీ ఇతర దేశాలను సర్వనాశనం చేసి మరీ తాను కూడా పూర్తిగా విధ్వంసమవుతుంది. ఇక్కడ ఇజ్రాయిల్ ప్రభావంతో అమెరికా యుద్ధంలోకి దిగిందా? లేక ఇరాన్‌ను నియంత్రించడానికి అమెరికా పోరాటం చేస్తున్నదా? అన్నది కాదు ప్రధానం. ఈ యుద్ధంతో సంబంధం లేని యావత్తు దేశాలు తీవ్ర సంక్షోభంలో మునిగిపోవడమే విషాదం. ఉక్రెయిన్‌కు సహాయం చేస్తూ గత ఐదేళ్లుగా తనను నానా ఇబ్బందులకు గురిచేయాలని చూసిన పశ్చిమదేశాలే ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోవడం రష్యాకు ఆనందం కలిగిస్తుండవచ్చు. అదీకాకుండా ట్రంప్ తవ్విన గొయ్యిలో అమెరికాతోపాటు యూరప్ దేశాలు కూడా పడటమే కాకుండా, రష్యా ఆర్థికంగా మరింత పరిపుష్టం కావడం తాజా పరిణామం. ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధ తీవ్రతను తగ్గిచడానికి యత్నాలు జరుగుతున్నా, పరిస్థితులు మాత్రం ఉద్రిక్తంగానే కొనసాగుతాయి. ఇరాన్ దారికొచ్చే వరకు కాల్పుల విరమణ సా ధ్యం కాదన్న ఉద్దేశంతోనే ట్రంప్ వుండటం గమనార్హం. హిజ్‌బుల్లా స్థావరాలపై ఇజ్రాయిల్ తన దాడులను కొనసాగిస్తోంది. ఇజ్రాయిల్, యుఎస్ ఆధీనంలోని 55 స్థావరాలపై శనివారం వర కు 77 దాడులు చేసినట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించారు. యుద్ధం మొదలై 23 రోజులు గడిచినా ఇప్పటివరకు ఫలితం ఎటూ తేలలేదు.



ప్రస్తుతం దేశీయంగా ప్రత్యామ్నాయ ఇంధనం కోసం ప్రభుత్వం చేస్తున్న యత్నాలు ఫలించి అ నుభవంలోకి వచ్చేసరికి మరో ఐదేళ్ల కాలం పట్టవచ్చు. అది కూడా పూర్తిగా సాధ్యంకాదు. ఈ అనుకోని గడ్డు పరిస్థితిని కేంద్రం ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.కాగా ప్రధాని నరేంద్రమోదీ కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఫ్రాన్స్, ఒమన్, జోర్డాన్ దేశాల నాయకులతో చర్చించి యుద్ధాన్ని నిలుపుచేసేందుకు తగిన



చర్యలు తీసుకోవాలని కోరారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి కూడా యుద్ధాన్ని తక్షణం నిలుపు చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఈ యుద్ధం ద్వారా యుఎస్/ఇజ్రాయిల్ లక్ష్యాలు వేరు. ఇదే సమయంలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మజ్తబా ఖమేనీ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. ఈ పరిస్థితిలో సంయమన సాధన ఎంతవరకు కుదురుతుం ది? యుద్ధం ముగించడంమే లక్ష్యమని యు.ఎన్. చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా వున్నాయి. మొత్తంమీద చెప్పాలంటే ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్యలో భారత్ ఇరాన్‌కు అవసరమైన మందులతో కూడిన నౌకను పంపడం విశేషం. ఈ నౌక 18వ తేదీన ఇరాన్ చేరింది. సుమారు నాలుగువేలమంది ఇరాన్ పౌరులు మరణించినట్టు, ఎంతోమంది క్షతగాత్రులైనట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో ఆ దేశానికి వైద్య సహాయం నిమిత్తం ఔషధాలతో నౌకను పంపిన తొలి దేశం భారత్! ఈవిధంగా ప్రజల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుంది కనుకనే భారత్ "విశ్వగురు" లేదా "విశ్వ హితుడి" స్థానాన్ని సంపాదించుకుంది. కాగా ఈ విధంగా సహాయం అందించినందుకు ఇరాన్ అధికారికంగా మనదేశానికి కృతజ్ఞతలు తెలిపింది. కాగా మనదేశం పంపిన ఔషధాలను ఇరాన్‌లోని "రెడ్ క్రిసెంట్" సంస్థ అందుకున్నది. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ చేసిన ఈ సహాయం కొన్ని వేల సంవత్సరాల చరిత్ర వున్న ఇరుదేశాల చారిత్రక, సాంస్కృతిక సంబంధాలకు నిదర్శనమని ఇరాన్ అధికార్లు పేర్కొన్నారు. భారత ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్‌కు విరాళాలు అందించాలనుకునే భారతీయుల కోసం ఆ దేశ కాన్సులేట్ ప్రత్యేక బ్యాంక్ ఖాతా వివరాలు విడుదల చేసింది.




## ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా..

### దిగుమతులకు సిద్ధమవుతున్న ఇండియన్ రిఫైనరీలు



**డెస్క్, నేటిధాత్రి:**
భారత్‌కు ఒక రకంగా ఇది గుడ్ న్యూస్. ఇరాన్ నుంచి చమురు కొనేందుకు ఉన్న ఆంక్షల్ని అమెరికా ఎత్తివేసింది. దీంతో ఇకపై ఇండియా.. ఇరాన్ నుంచి కూడా చమురు కొనుగోలు చేసే వీలుంది. ఇదే జరిగితే, భారత్‌కు మరింత చమురు సరఫరా పెరుగుతుంది. ఈ నేపథ్యలో ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు భారత రిఫైనరీలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ వార్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తిన సంగతి తెలిసిందే. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాలు తీవ్ర చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి మూసివేతతో చమురు రవాణా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. అలాగే, గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడులు చేసి ధ్వంసం చేస్తోంది. దీంతో చమురు సంక్షోభం మరింత ముదిరే అవకాశం ఉంది. ఇప్పటికే బ్యారెల్ క్రూడాయిల్ దర 119 డాలర్ల వరకు చేరుకుంది. ఇంకా ధరలు పెరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తల్లకిందులవుతుంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ చమురు కొనుగోలుపై ఉన్న ఆంక్షల్ని అమెరికా ఎత్తివేసింది. ఇరాన్ చమురు కొనుగోలు చేయకూడదని అమెరికా చాలా కాలంగా ప్రపంచ దేశాల్ని కోరుతోంది. ఇరాన్ చమురు కొన్న దేశాలపై అమెరికా అదనపు సుంకాలు విధించడం సహా పలు ఆంక్షలు విధిస్తోంది. దీంతో అమెరికా ప్రభావంతో అనేక దేశాలు ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేయడం లేదు. చైనా వంటి కొన్ని దేశాలు మాత్రమే అమెరికాను ధిక్కరించి ఆయిల్ కొంటున్నాయి. అయితే, ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో నెల రోజులపాటు ఇరాన్ చమురు కొనుగోలుపై ఉన్న ఆంక్షల్ని ఎత్తివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఏప్రిల్ 19 వరకు ప్రపంచ దేశాలు ఇరాన్ చమురు కొనుగోలు చేయవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ అన్నారు. అయితే, ఇది ఇప్పటికే ఇరాన్ నుంచి రవాణా ప్రారంభమై, మార్గ మధ్యలో నిలిచిపోయిన చమురు విషయంలోనే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకానీ, కొత్తగా ప్రారంభించే చమురు సరఫరాకు ఈ మినహాయింపు వర్తించదన్నారు. యుద్ధం కారణంగా ఇరాన్ చమురు నౌకలు సముద్రంలో నిలిచిపోయాయి. వాటి నుంచి మాత్రమే చమురు కొనాలని అమెరికా చెబుతోంది. దీని ద్వారా అదనంగా 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు అందుబాటులోకి వస్తుందని అమెరికా అంచనా వేస్తోంది.






# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక
21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం



ఆదివారం 22-03-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 303 రూ॥ 6.00


## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సీఎం రేవంత్ ప్రారంభం

- భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు
- రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సీఎం
- సీఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు



సిద్దిపేట, నేటిధాత్రి:
సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును అందించనుంది.
మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే వేదికపై రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం కూడా నిర్వహించనుండటం రైతాంగానికి శుభసూచకంగా భావిస్తున్నారు.
ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. భారీ ఎత్తున ఏర్పాట్లు చేయగా, పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఆధునిక సాంకేతికతతో ఫ్యాక్టరీ

62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ప్రారంభ దశలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేయనుంది. భవిష్యత్తులో దీనిని 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తికావడంలో మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషించగా, ఆయిల్ ఫెడ్ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేశారు.

### రైతు మేళా – అవగాహనకు వేదిక

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో:
ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఆయిల్ పామ్ సాగు మెళకువలు ప్రభుత్వ పథకాలపై అవగాహన రైతులకు ప్రత్యక్షంగా అందిస్తున్నారు.

### రైతు భరోసా నిధుల విడుదల

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయనుంది.
మొదటి విడతలో 70 లక్షల మంది రైతులకు రూ.3,590 కోట్లు
20 రోజుల్లో మరో రూ.2,650 కోట్లు
మొత్తం రూ.9,000 కోట్లను 1.50 కోట్ల ఎకరాలకు జమ చేయనుంది

### భారీ రైతు మహోత్సవం

నంగునూరు మండలం నర్మెట్టలో నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వ్యవసాయం, ఉద్యానవనం, పాడి, మత్స్య, చేనేత వంటి విభాగాలు ఇందులో పాల్గొంటున్నాయి. సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

### సాంకేతిక వ్యవసాయానికి ప్రోత్సాహం

సోలార్ సాంకేతికతతో మొబైల్ యాప్ ద్వారా పొలాలకు నీరు అందించే సిస్టమ్‌ను 'ఆటోపామ్' సంస్థ పరిచయం చేసింది. బిందు సేద్యంతో పాటు మందుల పంపిణీ కూడా చేయగల ఈ విధానం చిన్న రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

### సమగ్ర వ్యవసాయ విధానం

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని ప్రదర్శించారు. చిన్న రైతులు వరి, కందులు, మొక్కజొన్నతో పాటు కూరగాయలు, పాడి, కోళ్ల పెంపకం, చేపలు, గొర్రెలు వంటి మిశ్రమ వ్యవసాయంతో రోజువారీ ఆదాయం పొందవచ్చని సూచించారు. అలాగే తెలంగాణ సోనా, కేఎన్‌ఎమ్–1638 వరి, డబ్ల్యూఆర్జీ–255 కంది, ఎంయూజీ–385 పెసర వంటి అధిక దిగుబడి విత్తనాలను ప్రదర్శించారు. మొత్తం మీద నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాక్టరీ, రైతు మేళా, భరోసా నిధుల విడుదల– తెలంగాణ రైతాంగానికి కొత్త ఆశలు నింపుతున్నాయి.

# తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం











- ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు
- వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు
- ఏఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు
- భక్తులను నేరుగా కలుసుకుని చర్చించి చంద్రబాబు

తిరుమల, నేటిధాత్రి:
సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్ఠతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు .

## ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు



తిరుమల, నేటిధాత్రి:
తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా టిటిడి ఆలయాలు

- తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు
- కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి
- అధజకారులకు సీఎం చంద్రబాబు సూచనలు

తిరుమల, నేటిధాత్రి:
తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## గుడ్ న్యూస్.. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు ఎంతంటే.?




అమరావతి , నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసు ను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై నేడు(శనివారం) సమావేశమైన మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, నారాయణ సానుకూల నిర్ణయం తీసుకున్నారు.



వయసు సడలింపు అంశాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిరాకరించగా.. కూటమి ప్రభుత్వం మాత్రం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేలుచేసే నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు. ఈ మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు ఉద్యోగులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు మేలు చేసిన కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

- నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం
- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రాంభోత్సవాలకు రావడం..రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట, నేటిధాత్రి:
సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మేట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయీ పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600–1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్, మార్చి 21 రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన 'ఈద్-ఉల్-ఫితర్' సందర్భంగా. శుభకాంక్షలు తెలియజేసిన మండల బీ ఆర్ యస్ పార్టీ యువనాయకులు. మెదపల్లి తాజా మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ . ముస్లిం సహోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి చివరి రోజు వరకు ప్రతి రోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని వారు అన్నారు ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యతనిస్తూ, విభిన్న మతాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగా-జమున తెహజీబ్‌కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం, ప్రగతి కోసం విద్య తదితర రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వారి జీవన విధానంలో గుణాత్మక మార్పుకు దోహదం చేశాయని ఈ సందర్భంగా పరమేశ్వర్ పాటిల్ అన్నారు ప్రగతి తిరిగి పుంజుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ పరమేశ్వర్ పాటిల్ ఆకాంక్షించారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఝరాసంగం మండలం బొరేగౌ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆ గ్రామ సర్పంచ్ నాగేందర్ పటేల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వం అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు రోడ్ల నిర్మాణంతో అభివృద్ధికి పునాదులు పడతాయని తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తాగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవదానం సర్పంచ్ వార్డ్ మెంబర్లు పోలీస్ బసవరాజ్ నాగరాజ్ దిలీప్ తెలుగు వీరన్న ఎక్కిలి పాపయ్య వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఇనగాల



**పరకాల,నేటిధాత్రి:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల పట్టణంలోని ముస్లిం సోదరులకు హృదయపూర్వక 'ఈద్ ముబారక్' తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మానవాళికి శాంతి, ప్రేమ మరియు త్యాగ నిరతిని చాటిచెబుతుందని కొనియాడారు.
ముస్లిం సోదరులు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆచరించిన ఉపవాస దీక్షలు సమాజంలో క్రమశిక్షణను, పేదలకు చేసే దానధర్మాలు సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వంలో తెలంగాణలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని, నియోజకవర్గ ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సెలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌పై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శలు

## వరంగల్ జిల్లాకు సరైన కేటాయింపులు లేవని అసంతృప్తి
## వాస్తవాలకు విరుద్ధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్న ఆరోపణలు
## నిరుద్యోగ యువతను మోసం చేసే పథకాలనిఆరోపణ
## వ్యవసాయ, కార్మిక రంగాలకు నిధుల లోపం



నర్సంపేట, నేటిధాత్రి: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందని నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ చిత్తశుద్ధిలేని అబద్ధాల కూర్పుగా ఉందని ఆరోపించారు. "రాజీవ్ యువ వికాసం" పేరుతో నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ అమలు విషయంలో స్పష్టత లేదని పేర్కొన్నారు. గత రెండు బడ్జెట్లలో ప్రస్తావించిన అంశాలనే మళ్లీ చేర్చారని, కొత్తగా ఎలాంటి కేటాయింపులు చేయలేదని అన్నారు. వ్యవసాయ కూలీలకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం కల్పించే చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ ప్రస్తావన లేకపోవడం రైతులకు నిరాశ కలిగించిందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులైన దేవాదుల వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని పేర్కొన్న ఆయన, జిల్లా అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని అన్నారు. ప్రజాప్రతినిధులు ఈ బడ్జెట్‌పై ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సూచించారు.

# నర్సంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా ప్రారంభం
## రైతులకు కనీస మద్దతు ధర హామీ -- పారదర్శక కొనుగోళ్లకు ఆదేశాలు



**నర్సంపేట, నేటిధాత్రి:** వరంగల్ జిల్లాలోని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ మరియు నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్నకు సరైన ధర లభించేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించిన ఆమె, తేమ శాతం మరియు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. మొక్కజొన్నలో తేమ శాతం 14 శాతానికి మించకూడదని తెలిపారు. క్వింటాల్‌కు రూ.2,400 ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలలోనే తమ పంటను విక్రయించాలని సూచించిన కలెక్టర్, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించి రైతులకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, డీఎం మార్క్‌ఫెడ్ రంజిత్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గత బడ్జెట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి

## ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి లేని బడ్జెట్:
## ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



**నర్సంపేట, నేటిధాత్రి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బడ్జెట్ ఆదాయ-వ్యయాలపై శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్ ఆర్భాటంగా ఉన్నప్పటికీ ఆచరణలో విరుద్ధంగా ఉందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగా మారుస్తుందని అన్నారు. రైతుల సంక్షేమానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని, రైతు రుణాలు, రైతు భరోసా, వరి ధాన్యం బోనస్ చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న, వరి, పప్పుదినుసులు వంటి పంటలకు కనీస మద్దతు ధర అమలు అయ్యేలా ధరల స్థిరీకరణ నిధిని కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవ్వాలంటే చిన్న, సన్నకారు రైతులకు 20 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలని, ఉపాధి, మహిళా, పారిశ్రామిక, కార్మిక రంగాలకు ప్రాధాన్యత పెంచాలని సూచించారు. అలాగే విద్య, వైద్య ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఆరు గ్యారెంటీలు మరియు 420 హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను చూపిస్తూ ప్రస్తుత బడ్జెట్ లోపాలను మరుగుపరిచే ప్రయత్నాలు చేయవద్దని రమేష్ హెచ్చరించారు.

# బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండి చేయి

## ఎన్నికల హామీలకు నిధుల కేటాయింపులేమి?
## బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ప్రశ్న



**నర్సంపేట,నేటిధాత్రి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్‌లో కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగ, కార్మిక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే బడ్జెట్‌లో తగిన నిధుల కేటాయింపులు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఉద్యోగ, కార్మిక వర్గానికి సరైన నిధుల కేటాయింపు జరగలేదని అన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18 వేల వేతనం, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలు, ఆర్పీలకు రూ.10 వేల వేతనం, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.24 వేల వేతనం ఇవ్వాలని హామీ ఇచ్చినా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆటో కార్మికులకు రూ.10 వేల భృతి వంటి హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేకుండా వేతనాలు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికీ తమ డిమాండ్ల కోసం కార్మికులు సమ్మెలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యువరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

# మానవత్వానికి మారు పేరు ఆర్టీసీ ఉద్యోగులు




## నర్సంపేట కండక్టర్ కుటుంబానికి రూ.5,21,936 ఆర్థిక సాయం

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట డిపోకు చెందిన కండక్టర్ బొమ్మ రాజ్‌కుమార్ గౌడ్ మరణంతో ఆపన్నస్థితిలో ఉన్న ఆయన కుటుంబానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలిచారు. చరిత్రలోనే తొలిసారిగా రికార్డు స్థాయిలో రూ.5,21,936 సేకరించి కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వాన్ని చాటారు. వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గౌడ్ నర్సంపేట డిపోలో గత 15 సంవత్సరాలుగా కండక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 20న బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆయన మరణించారు. దీంతో భార్య భవాని, ఇద్దరు చిన్నారులు ఆద్య (9), అభినవ్ (7) దిక్కుతోచని పరిస్థితిలో నిలిచారు. కుటుంబ పరిస్థితిని గమనించిన అదే డిపోకు చెందిన డా. గొలనకొండ వేణు ఆర్టీసీ వాట్సాప్ గ్రూపుల ద్వారా సహాయం కోరగా రాష్ట్రంలోని సుమారు 85 డిపోల నుండి వెయ్యికి పైగా ఉద్యోగులు స్పందించారు. అదేవిధంగా విశ్రాంతి ఆర్టీసీ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఉద్యోగులు, అద్దె బస్సు డ్రైవర్లు తదితరులు కూడా విరాళాలు అందజేశారు. సేకరించిన మొత్తంలో రూ.5 లక్షలను రాజ్‌కుమార్ కుమార్తె ఆద్య భవిష్యత్ అవసరాల కోసం నర్సంపేట పోస్టాఫీసులో డిపాజిట్ చేయగా, మిగిలిన రూ.21,936ను భార్య భవానికి అందజేశారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి డా. వేణు కృతజ్ఞతలు తెలిపారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ ఏర్పాటు..

ఈ సందర్భంగా "హెల్పింగ్ హ్యాండ్స్" పేరిట ఆర్టీసీ ఉద్యోగుల ఆపన్న హస్తం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ గొలనకొండ వేణు తెలిపారు. రాష్ట్ర కమిటీని ప్రకటించిన ఆయన, భవిష్యత్తులో క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో ప్రతి ఉద్యోగి నెలకు రూ.50 చందా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాసం రంజిత్ యాదవ్, ఎ. యుగేందర్, సంతోష్ కుమార్ లకావత్, వై. నాగరాజు, ముత్యాల రవీందర్, కందికొండ మోహన్, వేమునూరి గణేష్, ఎన్సీఈ రాజు, ఎం.ఎస్.రావు, పెద్ది రవీందర్, బొడిగె రాజు, మంద రాజు, కేఎస్.రావు, నల్ల శ్రీనివాస్, జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించి గుట్కా విక్రయం నలుగురిపై కేసులు నమోదు

▸▸ విద్యాసంస్థల సమీపంలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయం.... ▸▸ దాడుల్లో గుట్కా ప్యాకెట్లు స్వాధీనం... ▸▸ గీసుగొండ సి.ఐ డి. విశ్వేశ్వర్..







**గీసుకొండ, నేటిధాత్రి:** గీసుగొండ మండలంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ గుట్కా మరియు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు గీసుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఊకల్ గ్రామం మరియు ధర్మారం ప్రాంతాలకు చెందిన వ్యాపారుల దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బోయిని రాజేష్ కుమార్, ఎలసరపు రజినీకాంత్, పాలబోయిన సుమంత్, పార్వతి ప్రణయ్‌ల వద్ద నిషేధిత గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరు విద్యాసంస్థల సమీపంలోనే ఈ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. పంచుల సమక్షంలో సీజ్ చేసిన గుట్కా మరియు పొగాకు పదార్థాలపై సంబంధిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు గీసుగొండ సి.ఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# గీతాంజలిలో ఘనంగా ప్రీ రంజాన్ వేడుకలు



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ప్రీ రంజాన్ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ముస్లిం ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గీతాంజలి పాఠశాలలోని ముస్లిం విద్యార్థులు, అధ్యాపకులకు తోటి విద్యార్థులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం భిన్న మతాలు, భాషలతో కూడిన దేశమైందిగా, అందరూ పరస్పరం పండుగలను గౌరవించి జరుపుకోవడం మన ప్రత్యేకత అని ప్రతిపాదించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. రాజేష్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు మన దేశాన్ని గర్వంగా చూడడానికి కారణం భారతీయుల ఐక్యత అని తెలిపారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పరమత సహనాన్ని పెంపొందించడం అధ్యాపకుల బాధ్యత అని, ఇతర మతాల పండుగలు, ఆచారాలను గౌరవించడం ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ఒకరికొకరు ఖర్జూరాలు, మిఠాయిలు పంచుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# మల్లంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన



**దుగ్గొండి, నేటిధాత్రి:** దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహణపై వివరాలను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రానున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణ, పంపిణీపై తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిని లెక్కల అరుంధతి, మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ నియోజకవర్గం లో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ ప్రార్థన చేసుకున్న ముస్లింలు



**జహీరాబాద్, నేటిధాత్రి:** న్యాల్కల్ లో రంజాన్ సంబరాలు: ఐక్యతకు నిదర్శనం సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామంలోని ముస్లిం సోదరులతో పాటు ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరస్పరం అభినందనలు తెలిపారు. రంజాన్ పండుగ శాంతి, సోదరభావానికి ప్రతీక అని, మత సామరస్యానికి నిదర్శనంగా అన్ని వర్గాల ప్రజలు కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతిలక్ష్మి - ప్రవీణ్ కుమార్, స్వప్న భాస్కర్, బొల్లి కాశప్ప, ఇలియాస్ ఖాన్, ఇమ్రాన్, సున్నాఫ్ సత్యనారాయణ, గొల్ల రాములు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఐక్యత వాతావరణం నెలకొంది.

# జహీరాబాద్ సరిహద్దులో భారీగా అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో, రాష్ట్ర నిషేధ, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జహీరాబాద్-బీదర్ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. హొఇది కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో, నిషేధిత మత్తుపదార్థాలు, మద్యం సరఫరాను నివారించేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. హొఈ సమయంలో, వాహనాల్లో తరలిస్తున్న అక్రమ మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హొస్వాధీనం చేసుకున్న మద్యం సీసాలకు రసీదులు చూపించని వారిపై చర్య తీసుకున్నారు.

# జహీరాబాద్ నియోజకవర్గం లో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ ప్రార్థన చేసుకున్న ముస్లింలు





**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ పట్టణంలో శనివారం రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని జహీరాబాద్ కోహిర్ మొగుడంపల్లి న్యాల్కల్ ఝరాసంగం మండలాల ఈద్గా మసీదు,లోని సమీపంలోని ఆయా కాలనీల్లో ఉన్న అన్ని మసీదులతో పాటు రస్తాలో ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా మసీదుల్లో మతపెద్దలు రంజాన్ సందేశాన్ని జనులకు వినిపించి అందులోని మంచి విషయాలకు వెల్లడించారు. ప్రతివ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్పలక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూసిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం నంద్యాల రస్తాలో ఉన్న ఖబరస్తాన్‌లోని తమ పితురుల సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షులు షేక్ రబ్బాని రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఝరాసంగం మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బాని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఝరాసంగం మండలఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాటు చేసినా ముస్లింలను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బాని మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. స్నేహం, కరుణ, క్షమ, క్రమశిక్షణ, దయాగుణాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినం మానవాళిని ఆదర్శంతంగా తీర్చిదిద్దబడుతోందని అన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరు సంతోషకంగా గడపాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే ముస్లిం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బాని ఆత్మీయంగా పలుకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**జహీరాబాద్:** మండలంలో రంజాన్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని అన్నారు.



**కోహీర్:** ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. రంజాన్ పండుగను గురువారం పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలో నెలకొన్న అశాంతిని తొలగించి శాంతి కలిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యూనస్ తదితరులు పాల్గొన్నారు.

**మొగుడంపల్లి:** రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని ధనాసిరి సత్వార్ చెరక్ పల్లి ఈద్గాల వద్ద శనివారము ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్వార్ రోడ్డులోని వద్ద మత గురువులు మౌలానా మత గురువు ఈద్గా వద్ద పండుగ విశిష్టత గురించి వివరించారు. చిన్నారులు కూడా ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

**న్యాల్కల్ :** మండలంలో ముస్లింలు రంజాన్ పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హగ్నూర్ లోని ఈద్గా వద్ద ముస్లింలు సాముహిక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

**ఝరాసంగం:** మండలంలోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానాలు మొహమ్మద్ ఫుర్దోస్ ప్రవక్త బోధనలు, సందేశాలను వినిపించారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముచ్చుమర్రి పోలీసు బందోబస్తు చేపట్టారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొని,ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసిన

**మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్**



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ పట్టణంలోని పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద రంజాన్ పర్వదిన వేడుకల్లో ముస్లిం మైనారిటీ సోదరులతో కలిసి పాల్గొని వారికి పండగ శుభాకాంక్షలు తెలియజేసి అతి పవిత్రమైన రంజాన్ పర్వదినం మన అందరిలో సోదర భావాన్ని పెంపొందించి, మనలో కొత్త ఉత్సహాన్ని నింపాలని మరియు ఆ అల్లాహ్ అస్సిస్సులు జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరి పైనా ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ ఛైర్మెన్ గిరిధర్ రెడ్డి జహీరాబాద్ మునిసిపల్ ఛైర్మెన్ యూనుస్,వార్డ్ కౌన్సిల్లోర్స్ మరియు కాంగ్రెస్ నాయకులు హుగ్గేల్లి రాములన్న, తదితరులు పాల్గొన్నారు...

# ఈద్గా వద్ద జరిగిన ఉపవాస దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎస్ఆర్

**భూపాలపల్లి, నేటిధాత్రి:**



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సి.ఆర్ నగర్ బాంబుల గడ్డ ఈద్గా వద్ద జరిగిన ఉపవాస దీక్షలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు ఆచరించి, నెలవంక దర్శనం అనంతరం పండుగ జరుపుకోవడం ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. పండుగల సమయంలో అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ,ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. కుల,మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి లాభపడే శక్తులను ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా విద్యా రంగంలో మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ఇంకా ఖాళీగా ఉన్న సీట్లను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ,ప్రతి ఒక్కరు విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మున్సిపాలిటీ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ కౌన్సిలర్స్, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల చిత్రపటానికి పాలాభిషేకం



**యాదగిరిగుట్ట, నేటిధాత్రి:** యాదగిరిగుట్టలో నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించి తిరిగి క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామంటూ ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల బాల్రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల బాల్రెడ్డి మాట్లాడుతూ. పేదల పెన్నిధి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు ప్లాట్ల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు ఇప్పటిలాగానే తిరిగి ఆ ఇంట్లో ప్లాట్లను క్రయవిక్రయాలు జరిగేలా చూడాలని అసెంబ్లీలో బీర్ల ఐలయ్య ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడే బీర్ల ఐలయ్య మరో 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని అన్నారు ఈ సందర్భంగా కౌకుంట్ల బాల్రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కార్యకర్తలు బీర్ల చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం ప్రకటించారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, మాజీ ధర్మకర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేలిమిల్లి శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బంధారపు బిక్షపతి , నాయకులు గుండు నరసింహా గౌడ్, బొజ్జ శ్రీనివాస్, పచ్చిమట్ల మనోజ్ గౌడ్ బొజ్జ సాంబేష్, కోలా కృష్ణ గౌడ్ , సలాం, గంధ మల్ల వెంకటేష్, బీరు మల్లేష్ , కరుణాకర్, కంసాని యాదగిరి, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

**భూపాలపల్లి, నేటిధాత్రి:**



ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గ వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొని,వారికి ఆలయ్-బలాయ్ ఇచ్చి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# చిట్కుల్‌లో వెల్లివిరిసిన మత సామరస్యం.



▶▶రామాలయ ప్రాంగణంలో ముస్లిం సోదరులకు నీలం మధు రంజాన్ శుభాకాంక్షలు... ▶▶అరుదైన ఘటనకు చిట్కుల్ గ్రామం వేదిక అవ్వడం సంతోషకరం : నీలం మధు



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** కులం, మతం ఏదైనా మానవత్వం ఒక్కటేనని, భారతీయులందరూ సోదరభావంతో మెలగాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం రంజాన్ పండుగ పురస్కరించుకుని చిట్కుల్ మైనార్టీ సోదరులు నీలం మధు ముదిరాజ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక అరుదైన ఘటన కు చిట్కుల్ గ్రామం వేదికగా నిలిచింది. నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్కుల్‌లో జరుగుతున్న నూతన శ్రీ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతున్న వేదిక వద్ద పూజా పనుల్లో నిమగ్నమై ఉన్న నీలం మధును పవిత్ర రంజాన్ పర్వదినాని పురస్కరించుకుని స్థానిక ముస్లిం సోదరులు మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న తరుణంలో సంప్రదాయ దుస్తులలో ఉన్న నీలం మధు వద్దకు ముస్లిం సోదరులు



చేరుకోవడం మత సామరస్యానికి అద్దం పట్టింది. వారిని సాదరంగా ఆహ్వానించిన నీలం మధు, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, పండుగలు ఏవైనా అవి మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ప్రేమాభిమానాలను పెంచేవిగా ఉండాలని ఆకాంక్షించారు. ఒకవైపు రామాలయ పునఃప్రతిష్ట జరుగుతుండగా, అదే సమయంలో ముస్లిం సోదరులు వచ్చి రంజాన్ శుభాకాంక్షలు పంచుకోవడం గంగా-జమునా తెహజీబ్‌కు నిదర్శనమని ఆయన కొనియాడారు. భక్తి మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే సమాజం



అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేవాలయ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఈ ఆత్మీయ కలయిక స్థానికుల్లో అమితమైన ఆనందాన్ని నింపింది. రాజకీయాలకు అతీతంగా, అందరినీ కలుపుకుని పోయే నీలం మధు తీరును గ్రామస్తులు, ముస్లిం పెద్దలు ప్రశంసించారు ఈ కార్యక్రమంలో స్థానిక మైనారిటీ సోదరులు, ఆలయ నిర్వాహకులు, కాలనీ వాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా రంజాన్ వేడుకలు.

**చిట్యాల. నేటిధాత్రి:**



చిట్యాల మండల కేంద్రంలోని కౌసరే ఏ మసీద్ ఆవరణలోని ఈదుగా మైదానంలో పవిత్ర రంజాన్ పండుగ వేడుకలు ముస్లిం సోదరులందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు ఈ సమావేశంలో పాల్గొన్న మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం 30 రోజుల కటోర ఉపవాస దీక్ష విరమించుకొని ఈరోజు ఈద్గా లో నమాజ్ ప్రార్థన చేసుకుని ఆప్తులను స్నేహితులను కలుసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు ఈ సమావేశంలో మజీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అజ్మత్ మియా హైదర్ పాషా ఉపాధ్యక్షులు షఫీ పాషా జాయింట్ సెక్రెటరీ అక్బర్ ట్రెజరర్ హుస్సేన్ ఆరిఫ్ సాజిత్ మహమూద్ అల్లి పాషా తిరుమలాపూర్ హైమద్ నవాబుపేట మొదలగువారు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సిరికొండ



**భూపాలపల్లి, నేటిధాత్రి:** మున్సిపల్ పరిధిలోని సి ఆర్ నగర్ బాంబుల గడ్డ ఈద్గ వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి ప్రత్యేక ప్రార్థనలు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నేను స్పీకర్ గా ఉన్న కాలంలో ముస్లింలకు మైనార్టీ స్కూల్ కట్టి ఇవ్వడం జరిగింది ముస్లింల అభివృద్ధి కోసం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి అభివృద్ధి చేశారు అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ముస్లింలు మత పెద్దలు పాల్గొన్నారు

# రంజాన్ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

▶▶రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి... ▶▶రూ.50 లక్షల సీసీ రోడ్డు, ఫ్లాట్‌ఫాం పనులకు శంకుస్థాపన

**నర్సంపేట, నేటిధాత్రి:**



రంజాన్ పండుగను పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు శివారులోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకుని సన్మార్గంలో



నడవడానికి దోహదపడతాయని తెలిపారు. మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా నిరుపేద ముస్లింలకు అధిక సంఖ్యలో ఇంద్రమ్మ ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. అనంతరం ఈద్గా వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు మరియు సీసీ ఫ్లాట్‌ఫాం పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్,మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కౌన్సిలర్ బత్తిని రాజేందర్ , మున్సిపల్ కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు,మహిళా నాయకులు,యువజన కాంగ్రెస్ ప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రిని దర్శించుకున్న తన్నీరు హరీష్ రావు సతీమణి శ్రీనిత



**యాదగిరిగుట్ట, నేటిధాత్రి:** మాజీ మంత్రివర్యులు ఫ్లోర్ లీడర్ సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సతీమణి శ్రీనిత మరియు మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి
శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది....
అర్చకులు పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.

# రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**పటాన్‌చేరు, నేటిధాత్రి:** ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పర్వదినం వేడుకల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పటాన్చెరు పట్టణంలోని వివిధ ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ సోదరుడు, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కుమారుడు గూడెం విక్రమ్ రెడ్డి లు పాల్గొని, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన సబ్ ఇన్స్పెక్టర్ ని కలిసిన సర్పంచ్ తో ఆంజతా యూత్



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో గణపురం నూతన సబ్ ఇన్స్పెక్టర్ ని కలిసిన బస్వ రాజు పల్లి ఆంజతా యూత్ అసోసియేషన్ సభ్యులు తో అజంతా యూత్ అధ్యక్షుడు మిట్టపల్లి అరవింద్ మాట్లాడుతూ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ కోసం అజంత యూత్ సభ్యులతోసర్పంచి కలిసి ఏప్రిల్ 14 వరకు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టాలని చర్చించడం తో వారు సానుకూలంగా స్పందించి ఎన్నికల ముందు విగ్రహాన్ని పెట్టిస్తానని మాట ఇచ్చినది నిజమే నేను ఎమ్మెల్యేతో చర్చించాను అతి త్వరలో విగ్రహం పెట్టిస్తా అని చెప్పడం జరిగింది సర్పంచి అజంత యూత్ తో కలిసి గణపురం కు నూతన ఎస్సై గా వచ్చిన బి అశోక్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి యువత చేడు అలవాట్లుకి బానిస కాకుండా చూడాలి అని నూతన సబ్ ఇన్స్పెక్టర్ ని కోరుతూ మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో బస్వరాజుపల్లి సర్పంచ్ చింతకుట్ల సునీత –శ్రీనివాస్ , అజంతా యూత్ మిట్టపల్లి అశోక్,కన్నూరి రంజిత్,మట్టెవాడ హరీశ్,కుక్కమూడి కుమార్ స్వామి, మిట్టపల్లి కళ్యాణ్,బోచ్చు చందు, మిట్టపల్లి హరిక్రిష్ణ,బట్టు సాయి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పంచుకునే పాలన?

## 2026-27 రాష్ట్ర బడ్జెట్లో విద్య రంగానికి మరోసారి మొండి చేయి



**మంగపేట, నేటిధాత్రి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చెట్టుపల్లి చందు మాట్లాడుతూ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం 30% నిధులు కేటాయిస్తానన్న విద్యారంగం కి ఆర్థిక శాఖ మంత్రి 3,24,234 కోట్ల రూపాయలు విద్యా రంగానికి కేటాయించకుండా కేవలం గతంలో 7.6 శాతం ఇప్పుడు 8.22% అంటే కేవలం 0.6% మధ్య తేడా ఉంది కేటాయిస్తున్న అభివృద్ధి పరుస్తున్నాం అంటే ఈ విధంగా నా26,674 మాత్రమే కేటాయించారు ఆర్థిక మంత్రి భారీ స్థాయిలో ప్రసంగం ఉన్న కానీ క్షేత్రస్థాయిలో విద్యారంగపై శ్రద్ధ లేకుండా విద్యార్థుల సమస్యలు పరిష్కారం చూపలేదు ఇలా మేము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే విద్యారంగాన్ని ప్రత్యేక అభివృద్ధి వస్తామన్న ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్టు విద్యారంగంపై వైద్యరంగంపై శ్రద్ధ చూపెట్టకుండా మాటలు చెప్పడమే కానీ ఆచరణలో లేనటువంటి పరిస్థితి ఉంటుంది ఇప్పటికీ మెస్ బిల్లులు విడుదల కాక హాస్టల్ వార్డెన్లు అప్పులు చేసి మెడకు ఉన్న చైన్లు కూడా బ్యాంకులో పెట్టి విద్యార్థులకు భోజనం పెట్టే పరిస్థితి ఉంటుంది హాస్టల్లో కూడా మౌలిక సదుపాయాలు లేనటువంటి పరిస్థితి ఉంటుంది ఇలా బడ్జెట్ రిలీజ్ చేయడం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గా ఈ ప్రభుత్వానికి ప్రజాపాలన అంటున్నారు కానీ పంచుకునే పాలన లెక్క వ్యవహరిస్తున్నారు దున్నపోతువా మీద వర్షం కురిసినట్లే చేస్తున్న ప్రభుత్వం ఈ పద్ధతి సరికాదు అని గత ప్రభుత్వానికి ఏ విధంగా పరిస్థితి నెలకొందో ఈ ప్రభుత్వానికి కూడా విద్యార్థులుగా యువకులుగా చూపెడతామని అన్నారు పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాక పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గ విద్యార్థులు విద్యకు దూరమై విద్య మధ్యలోనే విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది కావున తక్షణమే పెండింగ్లో ఉన్నటువంటి విద్యారంగం బడ్జెట్ తక్షణమే రిలీజ్ చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై మండిపడ్డారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని ఆరోపించారు

# విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం



## బడ్జెట్ లో విద్య రంగానికి మొండి చేయి-మచ్చ రమేష్

**కరీంనగర్, నేటిధాత్రి:** విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక గీతా భవన్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో బడ్జెట్ పతులను దగ్ధం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం ఎనిమిది.ఇరవైరెండు శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందని కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ను కూడా విద్యారంగానికి కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం పదిహేను శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఈసంవత్సరానికి ఎనిమిది.ఇరవైరెండు శాతం మాత్రమే కేటాయించడం దారుణమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ నాలుగు.మూడువందల నలబై మూడు కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటని రమేష్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెయ్యి కోట్లు, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి నాలుగు వందల కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వవిద్యాలయాల పరిస్థితి ఏంటని, రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదని, యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు సుమారుగా ఐదువేల కోట్ల రూపాయలను కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటని, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల ఊసే లేదన్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవు. ఈనిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు, విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ముప్పై శాతం అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నునావత్ శ్రీనివాస్ నాయక్, ఎఐఎస్ఎఫ్ నగర్ ఉపాధ్యక్షులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్, నాయకులు సంపత్, సాయికృష్ణ, అశోక్, అభి, తదితరలు పాల్గొన్నారు.

# హామీలు గాల్లో.. కేటాయింపులు కాగితాలపైనే

## ఏఐఎప్డిడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ మహిళల సంక్షేమానికి తీవ్ర అన్యాయం చేసిందని, ఈ బడ్జెట్ పూర్తిగా మహిళా వ్యతిరేక బడ్జెట్ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ విమర్శించారు.
ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె బడ్జెట్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
మహిళల కోసం కేటాయించాల్సిన నిధులు గణనీయంగా తగ్గించబడినట్లు పేర్కొన్నారు.
మహిళా సంక్షేమ పథకాలకు సరిపడా నిధులు కేటాయించకుండా కేవలం ప్రకటనలకే పరిమితం కావడం ఆందోళనకరమని తెలిపారు. మహిళల ఉపాధి, ఆరోగ్యం, భద్రత, విద్య వంటి కీలక రంగాల్లో స్పష్టమైన ప్రణాళికలు లేకపోవడం ఈ బడ్జెట్ వైఫల్యాన్ని సూచిస్తోందన్నారు. రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో మహిళలకు కేటాయించిన భాగం సుమారు 8 నుంచి 10 శాతం మాత్రమేనని, జనాభాలో మహిళలు దాదాపు 50 శాతం ఉన్న నేపథ్యంలో ఇది చాలా తక్కువని అన్నారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు కేటాయింపులు గత సంవత్సరం తో పోలిస్తే కేవలం 3 నుంచి 5 శాతం మాత్రమే పెరిగాయని, ఇది ద్రవ్యోల్బణం కంటే కూడా తక్కువని తెలిపారు. మహిళల భద్రత కోసం కీలకమైన షీ టీమ్స్, పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కేటాయింపులు తగ్గడం గమనార్హమని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వేతనాల పెంపు గురించి స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం మహిళా కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిస్తోందని విమర్శించారు. స్వయం సహాయక సంఘాలకు అందించాల్సిన నిధుల్లో గణనీయమైన పెరుగుదల లేకపోవడం గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు అడ్డంకిగా మారుతుందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30 శాతం మహిళల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచాలని, మహిళల భద్రత కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ రుణాలు, సబ్సిడీలు పెంచాలని, మహిళా ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే విధానాన్ని ప్రభుత్వం విడనాడాలని, మహిళల హక్కులు, సమాన అవకాశాల కోసం పోరాటం మరింత బలపడాల్సిన అవసరం ఉందని వంగల రాగసుధ పేర్కొన్నారు.

# నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ, 26వ వార్డుల్లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ గంధం నరేందర్ గుప్తా, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ అవసరాలు మరియు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా లో–వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటం వల్ల ఏర్పడుతున్న లో–వోల్టేజ్ సమస్యలను అరికట్టడంలో ఇవి ఉపయోగపడతాయని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు హనుమకొండ శ్రీధర్, మండల శ్రీదేవి శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, శ్రీరామోజు రోజారాణి, ఇస్లావత్ రామగోపి, వేల్పుల శ్రీలత, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలు విస్తృతంగా నిర్వహించాలి



**నర్సంపేట, నేటిధాత్రి:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ వీరులు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల విస్తృతంగా95వ వర్ధంతి స్మారక వారోత్సవాలను మార్చి 23 నుండి 30 వరకు అన్ని విద్యాసంస్థల్లో నిర్వహించాలని కోరుతూ శనివారం నర్సంపేట డివిజన్ కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులు డి. వినయ్, జిల్లా సహాయ కార్యదర్శి అలువాల నరేష్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగాలు చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో నేటి విద్యార్థి యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో కుల, మతోన్మాదం పెరుగుతోందని, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక దోపిడీ ఎక్కువైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని, 2026--27 బడ్జెట్‌లో విద్యారంగానికి సుమారు 8 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అందరికీ సమానమైన నాణ్యమైన విద్య కోసం, లౌకిక ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నర్సంపేట డివిజన్ నాయకులు శివ, మణికంఠ, రాజు, చరణ్, మధు, రత్నం, శ్రావణ్, అభి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో మూడు సీట్లు సాధించిన అక్షర విద్యార్థులు



**రామడుగు, నేటిధాత్రి:** ఇటీవల ప్రకటించిన నవోదయ ఎంట్రన్స్-2026 ఫలితాలలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని అక్షర హై స్కూల్ విద్యార్థులు డి.ఆరోహి, అ.శివమనితేజ, జి.నిక్షిత ముగ్గురు విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి గాను సీట్లు సాధించారని కరస్పాండెంట్ మినుకుల మునీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు. డి.ఆరోహి ఓవరాల్ గా పదహారవ ర్యాంక్, అ.శివమనితేజ పంతొమ్మిదవ ర్యాంక్, జి.నిక్షిత నూట ఏడవ ర్యాంక్ సాధించారని, గత సంవత్సరములో కూడా మూడు సీట్లు వచ్చాయని, ప్రతి సంవత్సరము నవోదయలో సీట్లు సాధిస్తూ నాణ్యమైన విద్యకు అక్షర హై స్కూల్ చిరునామాగా నిలిచిందని తెలిపారు. ఈసందర్భంగా ప్రైవేట్ రావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# నాలుగు లేబర్ కోడ్స్ ను నిలిపివేయాలి



## ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.అంజయ్య

**నస్పూర్, నేటిధాత్రి:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ సింగరేణిలో అమలవ్వకుండా చూడాలని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.అంజయ్య, కార్యదర్శి ఎం.పోచమల్లు అన్నారు. 130 ఏళ్ల గొప్ప చరిత్ర కలిగి న సింగరేణిలో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని,సింగరేణి సంస్థకు బొగ్గు ఉత్పత్తి చేయగలిగిన శక్తి సామర్థ్యాలు,సాంకేతిక పరిజ్ఞానం ఉందని అందువల్ల బొగ్గు గనులను అమ్మకానికి పెట్టడం మానుకొని సింగరేణి బొగ్గుగనులను సింగరేణి సంస్థకే వేలం లేకుండా ఇవ్వాలని,సింగరేణిలో పనిచేస్తున్న 30 వేలమంది కాంట్రాక్ట్ కార్మికుల కు జేబీసీసీఐ నిర్ణయించిన హై పవర్ వేతనాలు అమలు చేయించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని, దేశవ్యాప్తంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక కార్పొరేట్ సంస్థల అనుకూల నాలుగు లేబర్ కోడ్ లను సింగరేణిలో అమలు చేయవద్దని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణిలో అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపివాలని వారు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ సింగరేణిలో అపరిష్కృతంగా ఉన్న కార్మిక సమస్యలు పరిష్కారమయేంతవరకు సంఘటిత,అసంఘటిత కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని ఐక్య ఉద్యమాల ద్వారానే. సంఘటిత. అసంఘటిత. కార్మిక సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి



## ఏఐఎఫ్డిఎస్ నాయకుడు మార్త నాగరాజు విమర్శ

**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్డిఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు విమర్శించారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. 3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 26,674 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో విద్యకు 8.22 శాతం మాత్రమే కేటాయించగా, గత ఏడాది 7.6 శాతం కేటాయించారని, ఈ రెండు బడ్జెట్ల మధ్య వ్యత్యాసం కేవలం 0.6 శాతం మాత్రమేనని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. విద్యా కమిషన్ 18 శాతం నిధులు కేటాయించాలని నివేదిక ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో ఎక్కువ భాగం జీతాలకే సరిపోతుందని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండడం, మౌలిక సదుపాయాల లేమితో ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ బడ్జెట్‌ను ఏఐఎఫ్డిఎస్ వరంగల్ జిల్లా కమిటీ తరఫున వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్, వంశి, అజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



**నర్సంపేట, నేటిధాత్రి:** ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేసి, కనీస వేతనం రూ. 18 వేలుగా ప్రకటించిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ ఆశా వర్కర్స్ యూనియన్ ( బిఆర్టియు అనుబంధ) ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో ఆశా వర్కర్లు భారీ ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి వరంగల్ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు, ఆశాల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పిందని విమర్శించారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఆశాలకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. రెండు సంవత్సరాలుగా ఆశా వర్కర్లు ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో రోడ్డుపైకి రావాల్సి వచ్చిందన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశాల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్‌లో లేని పనులను ఆశాలతో చేయిస్తున్నారని, ఇకపై అలాంటి పనులు చేయబోమని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి సంధ్య, నాయకులు సాలమ్మ, సంధ్య, అనిత, వసుమతి, రామ, సునీత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కాటారం సబ్ డివిజన్ ఎమ్ సి పి ఎఫ్ కమిటీ ఏర్పాటు



**కాటారం, నేటిధాత్రి:** మండల కేంద్రం లోని రివైవ్ చర్చి లో మంథని ఎమ్ సి పి ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఐతు డేవిడ్ ఆధ్వర్యంలో కాటారం సబ్ డివిజన్ కమిటీ ఐదు మండలాల పాస్టర్స్ సమక్షంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. డివిజన్ అధ్యక్షుడుగా పప్పుల అబ్రహము ఉపాధ్యక్షుడుగా జి. శామ్యూల్ కార్యదర్శి గా సి ఎచ్ చందు ప్రధాన కార్యదర్శి ఆరమళ్ళ దైవకృపాకర్ కోశాధికారి ఏకు సతీష్ కుమార్ సహా కోశాధికారి ఎమ్ పీటర్ గౌరవ సలహా దారులుగా రొడ్డ యోహాను, దయాకర్ లను ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షుడు ఐతు డేవిడ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వారికీ శుభాకాంక్షలు తెలియ చేశారు మంథని కాటారం సబ్ డివిజన్ లోని చర్చిల అభివృద్ధి కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ఐ టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు కి కృతజ్ఞతలు తెలిపారు సమావేశంలో కాటారం సబ్ డివిజన్ పాస్టర్స్ హాజరై ప్రత్యేక కమిటీ ఏర్పాటు కోసం సహకరించిన పాస్టర్స్ కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని మెయిన్ డివిజన్ ఎమ్ సి పి ఎఫ్ కమిటీ ప్రధాన కార్యదర్శి అశోక్ కన్నూరి కోశాధికారి ఆరమల్ల దైవ కృపాకర్ మరియు ఐదు మండలాల పాస్టర్స్ పాల్గొన్నారు

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ పట్టణంలోని ఈద్గాహ్ వద్ద పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారిని ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రముఖులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



గారు మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ఠ, సహనం, దాతృత్వం మరియు మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనసు, మనోగతం పవిత్రమవుతుందని, సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మత, వర్గ భేదాలను పక్కన పెట్టి ఐక్యంగా జీవించడం సమాజ అభివృద్ధికి అవసరమని స్పష్టం చేశారు. ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, రంజాన్ సందేశం శాంతి, సహనం, సేవాభావం అనే గొప్ప విలువలను అందరికీ తెలియజేస్తుందని అన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ఈద్గాహ్ కమిటీ సభ్యులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆలయానికి నూతన వెలుగులు తీసుకురావడం శుభసూచికం



**నడికూడ, నేటిధాత్రి:** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి ఆలయం నిర్మాణం గ్రామస్తుల సహకారం తో పనులు ప్రారంభించగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సర్పంచ్ నేతృత్వంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని ఇటీవల కలవడం జరిగింది. ఆలయ నిర్మాణానికి పోల్స్ త్వరగా పనులు ప్రారంభించాలని సర్పంచ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని కోరగా ఎమ్మెల్యే నూతనంగా నాలుగు పోల్స్ ను ఉన్నత అధికారులతో మాట్లాడి అమలుపరిచి ఆలయ నిర్మాణానికి ఈరోజు సుమారుగా 200 మీటర్ల పొడవు నాలుగు పోల్స్ కరెంట్ లైన్ అందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కి గ్రామస్తులు అందరం కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సర్పంచ్ కోంగంటి తిరుపతి తెలిపారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల నాటి చీకటి రోజుల నుంచి ఈరోజు మన గ్రామం వెలుగుల్లో నూతన స్థాయికి ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు, ఆలయ అభివృద్ధికి, ప్రజా అవసరాల కొరకు తప్పకుండా కృషి చేస్తామని తెలిపారు, గ్రామానికి మరికొన్ని సీసీ రోడ్లు శాంక్షన్ అయ్యాయి అని అన్నారు, ఆ పనులు కూడ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు, ప్రస్తుతం హై స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం లో ఉందని పిల్లల భవిష్యత్తు కై కాంపౌండ్ వాల్ నిర్మించడం జరుగుతుందని అన్నారు, అది కుడా త్వరలోనే ప్రారంభించుకుంటామని తెలిపారు, ఈ వేసవి పంట పోచమ్మ తల్లి ఆలయం వద్ద వేసిన రైతుల పంట కోతల అనంతరం పూర్తిస్థాయిలో ఆలయంలో స్థల వివాదం నెలకొన్నదో మరికొన్ని రోజులలో పూర్తిస్థాయిలో రైతులకు ఆలయానికి ఎలాంటి నష్టం జరగకుండా ఉన్నతాధికారుల సమక్షంలో సర్వే జరిపించి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు, గ్రామ పాలక వర్గం సహకారం తో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం అని అన్నారు, గ్రామ దేవత ప్రజలందరినీ అందరిని చల్లగా దీవించాలని కోరుకుంటున్నాను ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మరింత సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దుకుందామని ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలను, భక్తులను కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన



కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ

**ముత్తారం, నేటిధాత్రి:** గత నెల రోజుల నుండి దైవ ప్రార్థనలు ఉపవాస దీక్షలతో పవిత్ర రంజాన్ చివరి రోజు ఈద్-ఉల్-ఫితర్ పండుగ సందర్భంగా అడవి శ్రీరాంపూర్ లో జరుగుతున్న ప్రార్థన స్థలానికి వెళ్లి ముస్లిం సోదరులందరికీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఆనందం నింపాలని కోరారు ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ నాయకులు లక్కం రాజు మరియు మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాంద్ పాషా, ముత్తారం మండల మైనార్టీ అధ్యక్షులు వాజీద్ పాషా. ఎఎంసి వైస్ చైర్మన్ మద్దెలరాజయ్య, ముత్తారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మైదం బండ సర్పంచ్. బియ్యాని. శివకుమార్ మరియు అడవి శ్రీరాంపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు. దేశిని రాజేశం కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్, కొట్టే ఉపేందర్, అనవేన. తిరుపతి, చిలువేరి లక్ష్మణ్, రామ్ రాజయ్య తదితరులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు

# రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

▶▶రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొన్న జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**జహీరాబాద్ , నేటిధాత్రి:** జహీరాబాద్ మార్చ్ 21 (విశాల తెలంగాణ) నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఈద్గా సమీపంలో ఏర్పాటు చేసిన రంజాన్ పండుగ వేడుకల్లో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మున్సిపల్ చైర్మన్ నాగేష్ శేట్కర్, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని “అలయ్ బలయ్” అని పలకరిస్తూ ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో , మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు రెయిన్బో

▶▶స్కూల్ గేటు ముందు ఆందోళన... ▶▶అధిక ఫీజుల పై ఆందోళన.. యాజమాన్యంతో గొడవ.... ▶▶అమీన్ పూర్ పరిధిలోని బీరంగూడ డివిజన్ లోని రెయిన్బో స్కూల్ లో అర్ధాంతరంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ శనివారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు వందలాదిమంది మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు.



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ లోని రెయిన్బో స్కూల్ లో అర్ధాంతరంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ శనివారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు వందలాదిమంది మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్పోర్ట్స్ యూనిఫార్మ్స్ తో పాటు ఎక్స్ ట్రా మెటీరియల్ పేరుతో రెయిన్బో స్కూల్ యాజమాన్యం




ఎప్పటికప్పుడు అధిక ఫీజులు ఇష్టానుసారం వసూలు చేస్తుండడంతో గత్యంతరం లేని పరిస్థితులలో యజమాన్యం పై పోరుకు దిగినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఎక్కడా లేని విధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అందుకు స్కూల్ యాజమాన్యం పై శాంతియుత నిరసనకు దిగామని అన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శాంతియుతంగా ఆందోళన చేసినప్పటికీ యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. రెయిన్బో స్కూల్ చైర్మన్ వచ్చి ఫీజుల వసూల్ పై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకి ఇవ్వాల్సిన బుక్స్ ఒకరికి పదిహేను వేల చొప్పున వసూలు చేయడం ఏంటని, అవే బుక్స్ బయట మార్కెట్లో కేవలం ఐదు వేల రూపాయల లోపు వస్తాయని అన్నారు. అంతేకాకుండా ఇతరత్ర మెటీరియల్ పేరు మీద వేలాది రూపాయల డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దిగివచ్చిన యాజమాన్యం...ఆదివారం ఉదయం పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతమని తెలిపారు

# పేదలకు కొండంత అండగా సీఎం సహాయ నిధి ఎమ్మెల్యే జీఎస్సార్





**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలంలోని 58 మంది లబ్ధిదారులకు 23,96,000/- రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరంలాంటిదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర అవసరాల సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఇళ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటూ ఇళ్లు కట్టిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ గణపురం సర్పంచి కట్కూరి రాధిక శ్రీనివాస్ పార్టీ నాయకులు గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్ అప్పయ్య పల్లె సర్పంచి ఎలకపల్లి రమేష్ గ్రామపంచాయతీలో సర్పంచులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎస్ఐ ని మర్యాదపూర్వకంగా కలి సిన సర్పంచ్



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం ఎస్సై గా నూతన బాధ్యతలు చేపట్టిన బి అశోక్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించిన లక్ష్మారెడ్డి పల్లి సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డి మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్ రెడ్డి ఉపసర్పంచ్ మొగిలి శంకర్ గ్రామ కమిటీ అధ్యక్షులు కాంతాల సమ్మిరెడ్డి మొగిలి ఓదెలు ఓరుగంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# చలో అసెంబ్లీ ముట్టడి విజయవంతం చేయండి



బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి

**భూపాలపల్లి, నేటిధాత్రి:** ఈ నెల 23న రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్ర రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హామీల అమలులో ఆలస్యం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోందని పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి భారీ ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు భరోసా, మహిళలకు తులం బంగారం, యువతకు స్కూటీలు, ఉద్యోగ అవకాశాలు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# క్షేత్ర ప్రదర్శనకు బయలు దేరుతున్న రైతులు.



**నల్లబెల్లి, నేటిధాత్రి:** రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగు పై ప్రత్యేక దృష్టి సాధించింది దీంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయిల్ ఫామ్ సాగుపై క్షేత్ర ప్రదర్శన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా నర్మేట గ్రామంలోని ఆయిల్ ఫామ్ సాగు తో పాటు పామాయిల్ గింజల నుండి ఇంధనాన్ని తీసే కర్మాగారాన్ని సైతం సందర్శించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖ ద్వారా చేపట్టింది. నర్మేట గ్రామంలోని పామాయిల్ పంట సాగుపై రైతులకు ఆర్థిక స్వాలంబన తోపాటు సాగు శ్రమ తగ్గింపు పై అవగాహన కల్పించనున్నారు. క్షేత్ర ప్రదర్శన కొరకై మండలం నుండి నల్లబెల్లి మండల కేంద్రం కొండాయలపల్లి. శనిగరం ముచింపుల రేలకుంట నందిగామ మేడపల్లి రామతీర్థం. గ్రామాల రైతులు సుమారు 250 మంది ఈ క్షేత్ర ప్రదర్శనకు శనివారం బయలుదేరారు. వీరి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్చార్జి సీఈవో ఎల్లన్న తదితరులు ఉన్నారు..

# ప్రధాన రహదారి ప్రమాదపు అంచులో.






**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ ప్రధాన గేటు ఎదురుగా ఉన్న రహదారి ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజులుగా ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గం దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, అంబులెన్స్‌లు ఈ రహదారి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. స్థానిక ప్రజల ప్రకారం, ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ కూడా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో, మేయర్ ప్రతిరోజూ ఇదే మార్గం ద్వారా ప్రయాణిస్తున్నప్పటికీ, సమస్య పరిష్కారంపై స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కోట్ల ఖర్చు చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ, ప్రధాన రహదారుల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# రంజాన్ పర్వదినం లో మత సామరస్యం వెల్లివిరుస్తుంది

**కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము**



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని ముస్లిం సోదరి సోదరులకు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము ముస్లింలకు హృదయపూర్వక 'ఈద్ ముబారక్' తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రంజాన్ పర్వదినం మతసామరస్యం వెల్లివిరుస్తుందని పండుగ మానవాళికి శాంతి, ప్రేమ, త్యాగనిరతిని చాటిచెబుతుందని కొనియాడారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆచరించిన ఉపవాస దీక్షలు సమాజంలో క్రమశిక్షణను, పేదలకు చేసే దానధర్మాలు, సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు నాయకత్వంలో నియోజకవర్గంలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని, నియోజకవర్గ ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఉప్పరపల్లిలో వెల్లివిరిసిన మత సామరస్యం

**గంగా-జమున తహజీబ్‌కు అద్దం పట్టిన 'దావతే ఇఫ్తార్'.... సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు... ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్**



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మండల ప్రజలు మత సామరస్యానికి నిలయంగా, గంగా-జమున తహజీబ్‌కు ప్రతీకగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో 'దావతే ఇఫ్తార్' వేడుక కన్నుల పండువగా జరిగింది. సమ్మి గౌడ్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సమ్మేళనంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించి తన ఉదారతను చాటుకున్నారు..

**అల్లాహ్ కృప.. ప్రజా ప్రతినిధుల చొరవ:** ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ "ముఖ్యంగా స్థానిక కాంగ్రెస్ వార్డు ప్రతినిధులు తండ సంపత్ గౌడ్, పలుస పద్మా వెంకన్న గౌడ్, కంచ రాజు కుమార్, బోనగిరి జ్యోతి, జనిగల అనిల్, యూత్ ఉపాధ్యక్షులు పలుస రాకేష్ గౌడ్, షబ్బీర్ కోరిక మేరకు, వారిపై ఉన్న ప్రేమ,గౌరవంతో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పవిత్రమైన కార్యం నిర్వహించే భాగ్యం కలగడం కేవలం ఆ అల్లాహ్ కృప వల్లే సాధ్యమైంది" అని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసం క్రమశిక్షణకు, త్యాగానికి మరియు సోదరభావానికి ప్రతీక అని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన భారతీయ సంస్కృతికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఉప్పరపల్లిలో ఈ రకమైన ఐక్యత చూడటం గర్వకారణంగా ఉందని, భవిష్యత్తులోనూ అందరం కలిసికట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ఇటువంటి సామాజిక కార్యక్రమాలకు, పేద ప్రజల సేవకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



**ఈ ఆధ్యాత్మిక వేడుకలో ముస్లిం కుల పెద్దలు మహమ్మద్ అమిరుద్దీన్, మహమ్మద్ పర్వేజ్ ఆలం (మొల్సబ్) ,మహమ్మద్ షబ్బీర్, రియాజ్, అజ్మాత్, గోర్మియా, అల్లవుద్దీన్, ఆజ్మీ యా, రహీంపాషా, సలీం పాషా, యాకుబ్, సర్వల్, రజాక్, గౌస్, నజీర్, సలీం పాల్గొన్నారు.**

కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రముఖులు మరియు వార్డు ప్రతినిధులు: గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీతా కుమార స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, పలుస వెంకన్న, నలకుర్తి ఉప్పలయ్య, పందిరి రాజు, పబ్బతి సారంగం, తండా శ్రీనివాస్, పలుస సంపత్, కోమాకుల రమేష్, బోనగిరి వీరయ్య, టేకుల మల్లారెడ్డి, అడపా రమేష్, ఎటు రోజు పరిపూర్ణ చారి, వత్సల సాంబయ్య, ఎసల్ల రాజు, జీజుల సందీప్, భోనగిరి రమేష్, గుండా కార్తీక్, పలుస రాకేష్, గ్రై వెంకన్న, శాగంటి రాములు, శాగంటి శ్రీనివాస్, ఎసల్ల సత్యం, తండా వెంకటేశ్వర్లు, బండారు అనిల్, మంద విక్రమ్, కంది సుధాకర్, పోలపాక ఉప్పలయ్య, రాజబోయిన యాదగిరి, కంచ కట్టయ్య, రవిచంద్ర, ఆవుల బాబు, ముదురుకోల రమేష్, పోల్దాసు సూరయ్య, బండారు వేణు, ముదురుకోల సంతోష్, పలుస నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో మైనారిటీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం..

**కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన నడిపిస్తుందని ఈ ప్రజా పాలనలో మైనారిటీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో మంత్రి వివేక్ ఈద్గాల వద్ద ముస్లింలను కలిసి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ, ముస్లింలు ఐక్యతగా ఉంటూ సోదర భావంతో మెలగాలని అన్నారు. నియోజకవర్గంలోని ఈద్గా ,దర్గాలకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూపొందించామని, సొంత స్థలం ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. రంజాన్ పండుగ శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నింపాలని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, మైనారిటీ నాయకులు అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, వోడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



# దళిత జర్నలిస్టులపై దాడులు జరిగితే సహించేది లేదు

**షాబాద్ మండల పరిధిలో జర్నలిస్టులపై దాడి చేసిన వారిని రిమాండ్ కు తరలించాలి... చేవెళ్ల నియోజకవర్గం ఎంజెఎఫ్ అడహాక్ నూతన కమిటీ ఎన్నిక.... ఎంజేఎఫ్ రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి మాదిగ... దళిత జర్నలిస్ట్ లపై దాడుల పట్ల ఖండన**



**చేవేళ్ల, నేటిధాత్రి:** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలో వరుసగా దళిత జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను మాదిగ జర్నలిస్టు ఫోరం (ఎంజేఎఫ్) రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి తీవ్రంగా ఖండించారు. దళిత జర్నలిస్టుల జరుగుతున్న దాడులను ఖండిస్తూ శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక అత్యవసర సమావేశం జరిగింది.సీనియర్ జర్నలిస్టులు ఇలిటం బుచ్చన్న, ఆశీగారి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డప్పు రామస్వామి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కేసారం శంకర్ రావు మాదిగతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డప్పు రామస్వామి మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత జర్నలిస్టులపై ఇక్కడ దాడులు జరిగిన సహించేది లేదన్నారు. గత నెల 25వ తేదీన షాబాద్ మండల పరిధిలో జర్నలిస్టులపై వరుస దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసిన ఇప్పటివరకు చేసిన వారిని రిమాండ్ కు తరలించకపోవటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు దోషులకు అండగా నిలుస్తూ ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయటం ఏమిటని ఆయన పోలీసులను ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు దళిత జర్నలిస్టులపై దాడి చేసిన దోషులను రిమాండ్ తరలించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ఈ విషయంపై ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో డిసిపి, ఫ్యూచర్ సిటీ కమిషనర్, జిల్లా కలెక్టర్, జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ లకు కూడా ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఏప్రిల్ 4వ తేదీన షాబాద్ మండల కేంద్రంలో ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, బహిరంగ సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు తరలి వచ్చి మాదిగ జర్నలిస్టుల సత్తా ఎంటో చూపుతామని ఆయన సవాల్ విసిరారు. అంతకుముందు సీనియర్ జర్నలిస్టు ఇలిటం బుచ్చన్న మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్యని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యవాదులు,ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు ఈ దాడులను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు,జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు చట్టం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం క్యాసారం శంకర్ రావు మాదిగ మాట్లాడుతూ దళిత జర్నలిస్టులపై ఒక పథకం ప్రకారమే దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ రాష్ట్రంలో దళిత మహిళలకు, జర్నలిస్టులకు, దళితులకు రక్షణ కరువైందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని దళిత జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రాబోయే రోజుల్లో దళిత జర్నలిస్టులకు అండగా నిలిచి ప్రత్యేకంగా పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

**చేవెళ్ల నియోజకవర్గం ఎంజెఎఫ్ అడహాక్ నూతన కమిటీ ఎన్నిక....** చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని 5మండలాలైన చేవెళ్ల, శంకర్పల్లి, నవాబుపేట్ మొయినాబాద్, షాబాద్ మండలాలకు చెందిన మాదిగ జర్నలిస్టులతో ఎంజెఎఫ్ అడహాక్ నూతన కమిటీ ఎన్నికైంది. ఈ నూతన కమిటీ కన్వీనర్ గా చేవెళ్ల ఆదాబ్ రిపోర్టర్ ఆశిగారి మహేష్, కో కన్వీనర్లుగా చేవెళ్ల మండలానికి చెందిన( ప్రజా జ్యోతి) విలేఖరి రమేష్, శంకర్పల్లి మండలం విలేఖరి సోప్పగల సంజీవ్, నవాబుపేట్ మండలం (నవ తెలంగాణ)విలేకరి పాండు, మొయినాబాద్ మండల (జ్ఞాన తెలంగాణ) విలేఖరి కుమార్, షాబాద్ మండల (సమయం) విలేఖరి అప్పల శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంజెఎఫ్ జర్నలిస్టులు చంద్రశేఖర్, శేఖర్, లోకరాజు, సుదర్శన్,వెంకటేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# రూ.16 లక్షల పనులకు చెల్లింపులు లేవు

**అప్పుల్లో కూరుకుపోయిన కాంట్రాక్టర్ తక్షణమే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్**



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో ఎస్‌డీఎఫ్‌సీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పెద్ద గొల్ల శ్రీధర్ సుమారు రూ. 16 లక్షల వ్యయంతో రోడ్డు పనులు పూర్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను పూర్తి చేయడానికి అప్పులు చేసిన కారణంగా ప్రస్తుతం నష్టాల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి బాధితులకు న్యాయం చేయాలని గురుజువాడ గ్రామ మాజీ సర్పంచ్ సంగారెడ్డి డిమాండ్ చేశారు.

# "డీసీసీ అధ్యక్షునికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన



**నర్సంపేట, నేటిధాత్రి:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ డీసీసీ అధ్యక్షులు అయూబ్ మహమ్మద్ ను ఆయన నివాసంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు సాయిలి ప్రభాకర్, ఆరుకట్ల సాయి మాట్లాడుతూ అల్లాహ్ దీవెనలతో ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ సోదరభావం, దాతృత్వం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని పెంపొందించే ఈ పవిత్ర పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందకర విషయమని తెలిపారు.

# మాట నిలబెట్టుకున్న సర్పంచ్ వెంకట్రాములు గౌడ్.

**పెద్ద చిలక తండాలో.. నూతన బోర్ మోటర్ ప్రారంభం.**



**జడ్చర్ల, నేటిధాత్రి:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని చిన్న రేవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద చిలక తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను గ్రామ సర్పంచ్ బత్తుల వెంకట్రాములు గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తండాలో మంచినీటి సమస్య రాకుండా చూస్తానని హామీ ఇచ్చానని.. హామీ మేరకు తండాలో తాగునీటి సమస్యలు లేకుండా ఉండేందుకు ఈ బోరు మోటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుడ మహేందర్, వార్డ్ సభ్యురాలు సరిత చంద్రనాయక్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బుజ్జి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ నాయక్, కిషన్ నాయక్, రవి నాయక్, శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి భక్తి భావం చాటిన నీలం మధు.

**సొంత నిధులతో చిట్కుల్ లో రామ మందిర నిర్మాణం.**
**శాస్త్రోక్తంగా మొదలైన శ్రీ రామచంద్రస్వామి ప్రతిష్టా వేడుకలు.**
**వేద మంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.**



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** ధర్మ రక్షణే ధ్యేయంగా, భక్తి భావంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శ్రీ రాముని ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. తన సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో శ్రీ రామచంద్రస్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం ఆయన చేపట్టిన ఈ శ్రీరామచంద్ర విగ్రహ ప్రతిష్టాపన



మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా సాగింది. మొదటి రోజైన శనివారం నీలం మధు దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 8:00 గంటలకు గోపూజ, మందిర ముఖ మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము నిర్వహించి, భక్తుల సమక్షంలో దీక్షాధారణ, రక్షాబంధన, యాగశాల సంస్కారము వంటి క్రతువులను వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అఖండ దీపస్థాపన, వాస్తు మండపారాధనలతో ఆలయ ప్రాంగణం ముచ్చట గొలిపింది. సాయంత్రం వేళ ప్రతిష్టా మూర్తులకు పంచవింశతి (25) కలశ స్నపనం (బింబ శుద్ధి) నిర్వహించారు. అనంతరం మూర్తులకు దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట యాగ మండప దేవతా హవనములు జరిపారు. వాస్తు, నవగ్రహ, క్షేత్రపాల దేవతలకు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో చిట్కుల్ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# మాజీ చైర్మన్ ను రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గంలో ని మాజీ చైర్మన్ నివాసంలో రమజాన్ పండుగ సందర్భంగా, దివంగత ఫరీదుద్దీన్ కుమారుడు మరియు మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ అయిన మహమ్మద్ తన్వీర్ నివాసానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, వివిధ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మరియు ఇతరులు శుభాకాంక్షలు తెలియజేయడానికి సందర్శించారు. ఈ సందర్భంగా ఫరీదుద్దీన్‌ను స్మరించుకున్నారు.

# కేసముద్రం లో ఘనంగా రంజాన్ వేడుకలు

**ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు కేసముద్రం టౌన్ మైనార్టీ అధ్యక్షులు ఎండి రషీద్ ఖాన్**



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మున్సిపాలిటీ లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈద్గా ప్రార్థనల్లో కేసముద్రం టౌన్ మైనార్టీ అధ్యక్షులు ఎండి రషీద్ ఖాన్ కుమార్తె కుమారుడు ఈద్గా రంజాన్ ప్రార్థనలో పాల్గొన్నారు. కేసముద్రం మున్సిపాలిటీలోని ముస్లిం సోదరులు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రార్థనల అనంతరం అక్కడికి విచ్చేసిన ముస్లిం సోదర సోదరీమణులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని ఆకాంక్షించిన ఆయన, పర్వదినాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలవాలని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తాయని చెప్పారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని రషీద్ ఖాన్ పిలుపునిచ్చారు.

# నేటిధాత్రి 9 NETI DHATHRI



## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**



ఆరోగ్య ధాత్రి

# ఈ పండు ఎప్పుడైనా తిన్నారా.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?

సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# ఐదు విటమిన్లు తప్పనిసరి!



ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

విటమిన్ డి3
దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12

ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.

### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా



హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.
ఓ పాఠకురాలు

కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్‌ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# సత్తువ పిండి



మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయులు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా
శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

# గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి
వాముజి,అవిసె గింజలు

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.







# కాశీబుగ్గ సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం





## గ్రానైట్ ఫ్లోరింగ్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ

నేటిధాత్రి, కాశీబుగ్గ.

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 19వ డివిజన్ కాశీబుగ్గలో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి హరి హర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయం అభివృద్ధికి ముఖ్యమైన అడుగు పడింది. జిడబ్ల్యూఎంసీ జనరల్ నిధుల నుండి మంజూరైన రూ.29.70 లక్షలతో చేపట్టనున్న గ్రానైట్ ఫ్లోరింగ్ పనులకు తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఆలయ నూతన ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకారం కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. రాబోయే శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంత్రి కోరారు.

నూతన ధర్మకర్తలుగా భూక్య మోతిలాల్, వెలిశాల మధుమతి, పోతన లక్ష్మి నరసయ్య, కుడికాల కోటి, లకుం భాస్కర్ నియామకాన్ని మంత్రి అభినందించారు. కమిటీ ఏర్పడిన రోజే సుమారు రూ.30 లక్షల నిధులు విడుదల కావడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని స్థానికులు, భక్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొందరు గుడిలో ఆధిపత్యం కోల్పోతున్నారనే కారణంతో అంతరాయం కలిగించే ప్రయత్నం చేసినా, పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారు. అనంతరం కార్యక్రమం సజావుగా కొనసాగగా, వచ్చిన భక్తులందరూ సంతృప్తిగా వెళ్లిపోయారు.

ఇప్పటికైనా వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీకి సహకరించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, మాజీ కార్పొరేటర్లు, 19వ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సిలివేరు రాజు, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, గుజ్జుల రాకేష్ రెడ్డి, రవి, జగన్ తదితరులు, ఆలయ నూతన ధర్మకర్తలు పాల్గొన్నారు.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

**.ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత**

వాషింగ్టన్, నేటిధాత్రి:

యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు.

ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# యుఎన్ఐ ఆఫస్ స్వాధీనం

- జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ, నేటిధాత్రి:

దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమీషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్



**డెస్క్, నేటిధాత్రి:**

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కేసీఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేకమంది పేదలకు లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్ధరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.

# ప్రధాన రహదారి ప్రమాదపు అంచులో..?

నేటిధాత్రి, వరంగల్.

వరంగల్ నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ ప్రధాన గేటు ఎదురుగా ఉన్న రహదారి ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజులుగా ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు.

ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గం దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, అంబులెన్స్‌లు ఈ రహదారి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

స్థానిక ప్రజల ప్రకారం, ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ కూడా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

ఇదే సమయంలో, మేయర్ ప్రతిరోజూ ఇదే మార్గం ద్వారా ప్రయాణిస్తున్న ప్పటికీ, సమస్య పరిష్కారంపై స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కోట్లు ఖర్చు చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ, ప్రధాన రహదారుల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.






# గృహ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై సుబేదారి పోలీసుల మెరుపు దాడులు!



- సుబేదారిలో డొమెస్టిక్ సిలిండర్ల కలకలం.
- హన్మకొండ ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు, కేసులు నమోదు.
- వ్యాపారాలకు సబ్సిడీ గ్యాస్ వాడితే జైలుకే.. హెచ్చరించిన సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్.

హన్మకొండ, నేటిధాత్రి:

సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది వ్యాపారస్తులు గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్లను తమ వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో, హనుమకొండ ఏసీపీ నరసింహారావు ఆధ్వర్యంలో సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తన పోలీసు బృందంతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కొన్ని దుకాణాలు మరియు వ్యాపార స్థలాల్లో సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్లు అక్రమంగా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సంబంధిత వ్యక్తుల వద్ద ఉన్న సిలిండర్లను స్వాధీనం చేసుకొని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసు నమోదు చేసినట్లు సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తెలిపారు. గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, ఇటువంటి చర్యలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లని డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ అయిన వాజిద్ కి అప్పగించినారు. అలాగే ప్రజలు మరియు వ్యాపారస్తులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అక్రమంగా సిలిండర్ల వినియోగం గమనించిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999